www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబర్ 2025
5

## సీనియర్ సిటిజన్లకు చట్టబద్ధమైన రక్షణ : జడ్జి

**ప్రజాశక్తి - కడప:** సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమానికి చట్టబద్ధమైన రక్షణను సంక్షేమ చట్టం–2007 అందిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లు ఏబుల్ ట్రాన్స్‌జెండర్ అండ్ సీనియర్ సిటిజన్ వారి సహకారంతో కడప నగర శివారులో గల చౌడమ్మ వృద్ధాశ్రమంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సంక్షేమ చట్టం కింద స్వీకరించిన పిటిషన్లను త్వరగా పరిష్కరించడానికి ప్రతి సబ్ డివిజన్లో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు లేదా బంధువులు ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించకపోతే, విధించవచ్చన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు చేతి కర్రలు, రెండు వీల్ చైర్ లను జడ్జి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లు ఏబుల్ ట్రాన్స్‌జెండర్ అండ్ సీనియర్ సిటిజన్ కృష్ణ కిషోర్, ప్రెసిడెంట్ దర్శిని సొసైటీ గోవిందరెడ్డి, చౌడమ్మ వృద్ధాశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకూ
# ఉద్యమిస్తాం

**- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి**

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు, నాయకులు

**ప్రజాశక్తి- కాశినాయన**

పోరుమామిళ్ల చెరువు కింద ఉన్న 10 గ్రామాల రైతులకు సంబంధించి 12 వందల ఎకరాల మునక ప్రాంతం గల భూమికి నష్టపరిహారం చెల్లించే వరకు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు సోమవారం రైతుసంఘం, వ్య.కా.స ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి పోరుమామిళ్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువెంగళాపురం, కొత్తూరు, కొండుడుగారిపల్లె, టేకూరు, తిమ్మారెడ్డిపల్లె, తోకలపల్లె, కవలకుంట్ల, దుగ్గాయిపల్లె, టేకురుపేట, సూరిసిద్ధిపల్లె గ్రామాల రైతుల పొలాలు పోరుమామిళ్ల చెరువు నిండడం వల్ల నీట మునిగాయని పేర్కొన్నారు. పోరుమామిళ్ల చెరువు కింద చెర్లోపల్లె పంచాయతీ కింద 16 గ్రామాలున్నాయి భూములన్ని ఎక్కువగా వరదల కారణంగా మునకకు గురవుతున్నాయని పేర్కొన్నారు. చేతికొచ్చే పంట కూడా వరదల కారణంగా మునిగి రైతులు నష్టాలపాలవుతున్నారని చెప్పారు. వరదల కారణంగా కృష్ణా జలాలు రావడంతో చెర్లోపల్లి చెరువు కింద ఉన్నటువంటి 12 వందల ఎకరాల రిజిస్టర్ భూములు మునిగిపోతున్నాయని, ఈ 1200 ఎకరాల కింద సుమారు 500 నుంచి 600 రైతులున్నారని, వీరు ఏటా తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారని వాపోయారు. ఏటా బ్రహ్మ సాగర్ నుంచి బద్వేల్ చెరువుకు నీరు వదలడంతో పోరుమామిళ్ల చెరువు కింద ఉండే చెర్లో పల్లెకు సంబంధించిన భూములు ముంపునకు గురవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెరువు పరిశీలన జరిగిందని, కానీ పరిష్కారం లేదని, అలాగే వీరారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు చెరువు పరిశీలన చేశారని, ఎమ్మెల్సీగా ఉన్న గోవింద్‌రెడ్డి, విజయమ్మ, రితీష్ రెడ్డిలు వీరందరూ హామీలిచ్చి మరిచారని పేర్కొన్నారు. ప్రస్తుతం నష్టపోయిన ఒక్కో రైతుకు ఎకరానికి రూ. 40 వేల నుంచి రూ. 45 వేల వరకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతవరకు పోరాటం ఆపేది లేదని చెప్పారు. కార్యక్ర మంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, పోరుమామిళ్ల రైతు సంఘం మండల కార్యదర్శి ఎన్. భైరవప్రసాద్, రైతులు రాజారెడ్డి, నాగిరెడ్డి, సుబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఆదినారాయణరెడ్డి బాలిరెడ్డి గోపాల్ రెడ్డి జయరామిరెడ్డి,రవికుమార్, రామసుబ్బారెడ్డి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి షేక్ గౌసియాబేగం పుల్లయ్య కొండమ్మ పాల్గొన్నారు.

# సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాశక్తి-పెండ్లిమర్రి/వీరపునాయునిపల్లె**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి మొత్తాన్ని రైతులకు పంపిణీ చేసి రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థలఎంపికపై పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాల్లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సోమవారం పర్యటించారు. రైతుల పంట పొలాలను, ఎరువులు, పురుగు మందుల విక్రయ కేంద్రాలను పరిశీలించనుండడంతో సంబంధిత ప్రాంతాల ఎంపిక కోసం ఆయా మండలాల్లో పరిశీలన చేశారు. ముందుగా రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కోసం పెండ్లిమర్రి మండల పరిధిలోని చిన్నదాసరిపల్లె పంట పొలాలు, వెల్లటూరులోని మానస ఫర్టిలైజర్, సీడ్స్, ఫెస్టిసైడ్ సెంటర్‌ను, హెలిప్యాడ్ ఏర్పాటుకు వెల్లటూరులోని పీఎం, జడ్‌పి హైస్కూల్ ప్రాంగణాలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించే రచ్చబండ కార్యక్రమం నిర్వహణ కోసం పెండ్లిమర్రి మండల కేంద్రంలో ఒక ప్రదేశాన్ని, చిన్నదాసరిపల్లి మరో ప్రదేశాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి హాజరయ్యే కార్యక్రమాలకు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వారి తోపాటు అధిక సంఖ్యలో రైతులు వచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, సిఎంఒ భద్రతా అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సిఎంఒ భద్రతాధికారి కృష్ణారావు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్ కుమార్, డ్వామా, డిఆర్‌డిఎ మెప్మా పీడీలు ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, తదితర జిల్లా అధికారులు, టిడిపి నాయకులు పుత్తా నరసింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

### పర్యటనకు గట్టి భద్రతా చర్యలు : కలెక్టర్

**కడప :** ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి మండలానికి విచేస్తున్న సందర్భంగా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశపు మందిరంలో సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లిమర్రిలో గ్రోమోర్ ఎరువుల దుకాణంలో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని, తరువాత రచ్చబండ వద్ద ప్రధాని మోడీ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో రైతులతో కలిసి పాల్గొంటారని చెప్పారు. పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## శివారు ప్రాంత కాలనీల
# అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**- నిరసనలో సిపిఎం నాయకుల డిమాండ్**

ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు, సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కడప నగరపాలక సంస్థ ఏర్పడి 21 సంవత్సరాలు పూర్తయినా నేటికీ శివారు ప్రాంత కాలనీల అభివృద్ధికి నోచుకోలేదని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ నగరంలో పేదలు నివసిస్తున్న కాలనీలో 20 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేదన్నారు. అభివృద్ధి అంతా ప్రధాన రోడ్ల వెంబడి జరుగుతుందని, నివాస ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ, మురుగు కాలువలు, శ్మశాన వాటికలు లాంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. నగరంలో ఉన్న ప్రజలందరూ పన్నులు కడుతున్నారని, అలాంటప్పుడు అభివృద్ధిలో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. పుట్లంపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, తక్షణమే దెబ్బతిన్న రహదారిని బాగుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాత కడప దళితవాడలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృత్యుంజకుంటలో సరైన రోడ్లు లేవని, డ్రెయినేజీ చాలా అధ్వానంగా ఉందని ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దస్తగిరిపేటలో ఉన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి తక్షణమే టెండర్లు పిలిచి రిష్కరించాలన్నారు. పాలెంపల్లె, రూకవారిపల్లె, బచ్చంపల్లె, లోహియా నగర్, తిలక్ నగర్, సుందరయ్య నగర్, రామకృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. నగర సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం పోరాడుతోందని, ఈ పోరాటంలో కడప నగర ప్రజానీకం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలపై నగర కమిషనర్ మనోజ్ రెడ్డికి వినతీపత్రం సమర్పించారు. నగర కమిషనర్ సమస్యలను పరిష్కరిస్తామనే సానుకూల స్పందనతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మ, నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, జమీలా, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, నరసింహ, విజయ్, శేఖర్, వెంకట రమణ, నారాయణ రెడ్డి, వరలక్ష్మి, శంషాద్, రాహుల్, రవి, విజయ్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఇస్తీమాకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- మైనార్టీ శాఖ మంత్రి ఎం.డి.ఫరూక్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వచ్చే ఏడాది జనవరి 23,24,25 తేదీల్లో కడప జిల్లాలో రాష్ట్రస్థాయి ఇస్తీమా కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మైనార్టీ శాఖ మంత్రి ఎం.డి.ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ఇస్తీమా కార్యక్రమానికి సంబంధించిన నమాజ్ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రితోపాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇస్తీమా కార్యక్రమాన్ని ఈసారి కడప జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని కార్యవర్గ కమిటీ సభ్యులు, అధికారులు, తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి రోడ్ మ్యాపు, తాగునీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బాకేడ్లు వంటి తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇస్తీమా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి పక్క ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెసి అదితిసింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్‌డిఒ జాన్ ఐర్విన్, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ,కడప కమిషనర్ మనోజ్ రెడ్డి, కార్య వర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు,

## విద్యార్థులకు చదరంగం పోటీలు

**ప్రజాశక్తి కడప అర్బన్ !** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పవన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం మేధస్సుకు సంబంధించిన క్రీడ అన్నారు. ఇతర క్రీడలు శారీరకంగా ఆరోగ్యాన్ని ఇస్తే ఈ క్రీడా మేథోశక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతగా ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అనీస్ దర్బారి, చీఫ్ ఆర్బిటల్ శ్రీకాంత్, సబిహ వ్యవహరించారు. నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, వివిధ పాఠశాల కళాశాల విద్యార్థులు చదరంగ పోటీల్లో ప్రతిభ చూపారు. కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సీనియర్ అసిస్టెంట్ పి.రాజ్ కుమార్, గ్రంథాలయ అధికారి జి.రాజ్‌కుమార్, నవాబు జాన్, జేమ్స్, సుబ్బమ్మ, రామ ప్రతాప్, శేఖర్, వెంకటరమణ, గౌస్ పాల్గొన్నారు.

## టిడిపి నగర నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** టిడిపి నగర నూతన కమిటీల ప్రమాణ స్వీకారం సోమవారం కడప ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, పార్టీ పరిశీల కులు ఎమ్మెల్సీ బి.టి. నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా, క్రమశిక్షణ, ప్రజా నిబద్ధతలను పాటిస్తూ ప్రజలతో నేరుగా అనుసంధానమై పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు లయన్ మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది పసుపులేటి గౌతమ్ కుమార్,మహిళా అధ్యక్షురాలు పార్వతి, రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కడప మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉస్మాన్, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, రాష్ట్ర వడ్డెర డైరెక్టర్ గండికోట వెంకట సుబ్బయ్య, రాష్ట్ర వెర్ హౌస్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ లోమడ చంద్రమోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జిలాని బాషా, నగర ప్రధాన కార్యదర్శి ముక్కర సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్, నగర కమిటీ కార్యదర్శులు డివిజన్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు ఆస్పత్రిలో అవినీతిని నిర్మూలించాలి

**ప్రజాశక్తి - కడప :** ప్రొద్దుటూరు ఆస్పత్రిలో అవినీతిని నిర్మూలించాలని కోరుతూ సోమవారం జాయింట్ కలెక్టర్ కు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్ ఫిలిం ప్రభుత్వం సరఫరా చేయనందున పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిటీ స్కాన్, ఎం ఆర్ఐ స్కాన్ లను ఉచితంగా అందజేయాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ ఇకపై ఆ సమస్య జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## అత్యధిక పాలసీలు సేకరిస్తాం

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** ఈ ఏడాది జనవరి 20న ఒకే రోజు 6 లక్షల పాలసీలు సేకరించామని, అదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం పనిచేస్తున్నామని ఎల్‌ఐసి కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి. ౹ఎస్.ఆర్.వి. రవికుమార్ అన్నారు. సోమవారం ఎల్‌ఐసి కార్యాలయ సమీపంలో మొబైల్ వెహికల్ ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో 10 మొబైల్ వాహనాలను రంగంలోకి దించుతున్నామని అన్నారు.

మాట్లాడుతున్న ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్

## న్యాయవాదుల హక్కుల కోసం
# నిరంతర పోరాటం

**ప్రజాశక్తి - కడప**

రాష్ట్రంలోనూ, దేశంలోనూ అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు సందర్భంగా అన్నమయ్య, కడప జిల్లాలలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కడప న్యాయవాదులను ఉద్దేశించి కోర్టు ఆవరణంలో మాట్లాడారు. 1982లో జస్టిస్ కృష్ణయ్యర్ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడిన భారత న్యాయవాదుల సంఘం అప్పటి నుంచి న్యాయవాదుల సమస్యల పట్ల అంకిత భావంతో పనిచేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భవంతో ఐఎఎల్ ముందుకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని న్యాయవాదుల అనేక సమస్యలను పరిష్కరించడంలో ఐఎఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్ , కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్ కుమార్, జాయింట్ సెక్రెటరీ మిఠాయిగిరి, ఖాదర్బాషా, రామ కొండయ్య, రాయచోటి బార అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, ఉపాధ్యక్షులు ధనుంజయ్ కుమార్, ట్రెజరర్ ఆదిరెడ్డి నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## టిడిపితోనే సుపరిపాలన : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె :** టిడిపితోనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి. సోమవారం స్థానిక మండల పరిధిలోని తాడిగొట్ల గ్రామంలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం ప్రజల చేత అర్జీలను స్వీకరించి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, మిగతా కొన్ని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుళాయి బాబు, ఇరిగేషన్ డిఇ జగదీశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు టి.వి. కృష్ణారెడ్డి, నాగిరెడ్డిపల్లె ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు గంధంమోహన్ బాబు, పాలగిరి అయ్యవారు, నరసింహులు నాయుడు, కమలాపురం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుక్కే భాస్కర్ నాయక్, విశ్వనాథ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, దర్బార్‌బాషా పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట సిఐగా నరసింహరాజు

**ప్రజాశక్తి - ఒంటిమిట :** ఒంటిమిట్ట సిఐగా నరసింహరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బాబు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన సిఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం, గ్రామస్థాయిలో సమస్యలను ముందుగానే గుర్తించడం, పండుగలు, జాతరల్లో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. రాత్రి వేళ్లలో పహారా బలోపేతం చేయడం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతానని చెప్పారు.

## రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**

జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఇఆర్ఒలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ 2026–పొలిటికల్ పార్టీ సమావేశంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి ఇఆర్ఒలు,రాజకీయ పార్టీ ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ప్రతిపాదించిన కేంద్రాలను స్వయంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ధృవీకరించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. సదరు ప్రతిపాదనలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పునఃపరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి ఇఆర్ఒ, ఎఇఆర్ఒ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 1963 పోలింగ్ కేంద్రాలున్నాయని, కొత్తగా 158 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు అందాయని తెలిపారు. రేషనలైజేషన్ తర్వాత జిల్లాలో మొత్తం 2121 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇందులో పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు కోసం 11, పోలింగ్ కేంద్రాల స్థానాల మార్పుకు 19 ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాలో నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలను ఎన్నికల నిబంధనల మేరకు జాగ్రత్తగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈ సందర్భంగా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఇఆర్ఒలు జాన్ ఐర్విన్, చెన్నయ్య, సాయి శ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వైసిపి నాయకులు హరుణ్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ గౌస్‌పీర్, సిపిఎం నాయకులు జి. చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ సిఎండి'కి స్పందన

**ప్రజాశక్తి - కడప :** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఎపిఎస్‌పిడిసిఎల్ నిర్వహిస్తున్న 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ నిర్వహించిన కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 67 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు.వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు పి. హెచ్. జానకి రామ్, జె. రమణా దేవి, ఎన్. శోభావాలెంటీనా, కె.ఆదిశేషయ్య, యం. మురళీకుమార్, పి. సురేంద్ర నాయుడు, జనరల్ మేనేజర్లు చక్రపాణి పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? : వైసిపి

**ప్రజాశక్తి - కడప :** కూటమి ప్రభుత్వ తప్పుల్ని ప్రశ్నిస్తే ఇలా దాడులు చేస్తారా అని అని డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, ఎస్‌సి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్, మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ ప్రశ్నించారు. హిందూపురంలో వైసిపి కార్యాలయంపై టిడిపి గూండాలు దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం వైసిపి నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో టిడిపి గుండాల దాష్టీకం హేయమైన చర్య అని అన్నారు. కార్యాలయ అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేసి అడ్డువచ్చిన వైసిపి కార్యకర్తలపైనా దౌర్జన్యం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ప్రజాస్వామ్యం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## భారతీయుల మృతి బాధాకరం

**ప్రజాశక్తి - కడప :** సౌదీ అరేబియా దేశంలోని మక్కా ,మదీనా పవిత్ర యాత్రలో బస్సు దగ్ధం ప్రమాద సంఘటనలో 45 మంది భారతీయులు మృతి చెందడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ సంతాపం తెలిపారు. కడపలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవిత్రమైన ఉమ్రా పర్యటనకు వెళ్లిన వారు మక్కా పవిత్ర సందర్శన అనంతరం అక్కడినుండి మదీనాకు వెళుతున్న మార్గమధ్యంలో ఆయిల్ ట్యాంకర్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో వారందరూ కాలిపోయి చనిపోవడం బాధాకర మన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## పారిశుధ్య సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలి

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** రిమ్స్ జిజిహెచ్‌లో పది, పదిహేను సంవత్సరాలుగా పనిచేస్తున్న పారిశుధ్య సూపర్‌వైజర్లను అకారణంగా తొలగించిన పద్మావతి హాస్పిటల్ మేనేజ్మెంట్ సర్వీసు యాజమాన్యంపై చర్యలు తీసుకుని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రిమ్స్ ప్రారంభం నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. కొత్తగా వచ్చినటువంటి కాంట్రా క్టర్ కార్మికులను అకారణంగా, నోటీసు ఇవ్వకుండా తొలగించడం సరైంది కాదని చెప్పారు. చాలా ఏళ్లుగా రిమ్స్ జిజిహెచ్‌లో పని చేస్తున్న వారిని, తొలగించడం ఇంతకన్నా దుర్మార్గం ఒకటి ఉండదని పేర్కొన్నారు. మూడేళ్లకు, ఐదేళ్ల కోఒకసారివచ్చే కాంట్రాక్టర్, వర్కర్ల మీద పెత్తనం చేయడం సరెంది కాదని తెలి పారు. కార్మికుల శ్రమను కొల్లగొట్టి వారి శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా కార్మికుల మీద పెత్తనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అకారణంగా తొలగించిన పద్మావతి హాస్పిటల్ మేనేజ్మెంట్ సర్వీస్ యాజమాన్యంపై చర్యలు తీసు కుని, ఆ కాంట్రాక్ట్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, ఉదయ్, విజయ్, శీను, రాహుల్, బాలాజీ రావు, మధు, ఉమా, బాలకృష్ణ , చెన్నయ్య, ఆదాము, శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## జనవరి 3న 'అల్లసాని' విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఆంధ్ర కవిత్వ చరిత్రలో యుగపురుషుడు, ఆంధ్ర కవితా పితామహుడు, తెలుగులో తొలి ప్రబంధానికి శ్రీకారం చుట్టిన అఖండ ప్రజ్ఞాశాలి అల్లసాని పెద్దన నడయాడిన పెద్దన పాడు గ్రామంలో జవనవరి 3న నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ కీ.శే. కొత్తపు యర్రపు రెడ్డి, లక్ష్మమ్మ మనుమడు గంగా చైతన్య కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం ఎర్రగుంట్ల మండలం కోడూరు గ్రామ వాస్తవ్యులు కొత్తపు రామమోహన్‌రెడ్డి, కళావతమ్మ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రసిద్ధ సినిమా నటులు, రచయిత, నాటక కర్త, ఆధ్యాత్మిక చింతనాపరుడు తనికెళ్ల భరణి విగ్రహావిష్కరణ చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అల్లసాని పెద్దన జీవితం – సాహిత్యం పై ప్రత్యేక సంచికను తెస్తున్నామని, శతాధిక కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.

## వైవీయూ బయోకెమిస్ట్రీ స్కాలర్ నవీన్‌కు డాక్టరేట్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ స్కాలర్ పి.నవీన్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆ శాఖ ఆచార్యులు పి.రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో నవీన్ 'ప్రినటెల్ ఎక్స్పోజర్ ఆఫ్ జస్టోరెటిక్ ఆన్ మేల్ అండ్ ఫిమేల్ రేప్రొడెక్టివ్ హెల్త్ ఇన్ విస్టర్ ర్యాట్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు, వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నవీన్ థీసిస్ డాక్టరేట్‌కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. నవీన్ రాసిన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా నవీన్ ను పలువురు అభినందించారు.

## రవీంద్రారెడ్డికి ఘన స్వాగతం

**ప్రజాశక్తి -కాశినాయన :** మండల పరిధిలోని చెన్నవరం గ్రామ సమీపంలో ఉన్న సాంబ శివ స్వామి ఆలయ కమిటీ వారు బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డిని ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం ఆయన స్వామివారిని సందర్శించేందుకు వెళ్లారు. ఆలయ కమిటీ వారు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన్ను పూలమాలతో శాలువాతో సత్కరించారు అనంతరం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. తానూ ఆలయ నిర్మాణ పనులలో సహకరిస్తానని చెప్పారు. ఆలయానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాశక్తి - కడప :** పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మైనార్టీ విభాగం నాయకులు ఖాదర్ ఖాన్, మాజీ మైనార్టీ నగర అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్ కోరారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మక్కా బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ తమ సానుభూతి వ్యక్తపరుస్తున్నామని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో ఇవిఎం ద్వారా ఎన్నికలు జరగబట్టే బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరిగి ఉంటే అధికారంలోకి వచ్చేది కాదని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరగాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలోని ఎస్‌సి, బిసి, మైనార్టీ యువతకు రుణాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్,సయ్యద్ అలీ పాల్గొన్నారు.

విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

## కరాటే పోటీల్లో 'సంసిద్' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - వేంపల్లె**

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో వేంపల్లెలోని సంసిద్ సతీష్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పరిమళాదేవి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది. కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి పలు పతకాలు సాధించారని చెప్పారు. సబ్ జూనియర్ బాలికల అండర్-49 కిలోల విభాగంలో దేశం దక్షిత రెడ్డి కాంస్య పతకం సాధించారని తెలిపారు. కెడెట్ బాలుర ఓవర్-65 కిలోల విభాగంలో పల్లె సుమధుర రెడ్డి అద్భుత ప్రతిభతో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. బాలికల కెడెట్ విభాగంలో కూడా అండర్-59 కిలోల విభాగంలో వల్లూరు ప్రదీప్తి కాంస్య పతకం సాధించగా, అదే విభాగంలో కరువుల్లెడ్డి విజయలక్ష్మి రజత పతకం సాధించి పాఠశాలకు పేరు తెచ్చారన్నారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

## రాయలసీమ నామకరణ దినంగా ప్రకటించాలి

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

నవంబర్ 18వ తేదీని రాయలసీమ నామకరణ దినోత్సవంగా అధికార పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1928 నవంబర్ 18 వరకు ప్రస్తుతం ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని దత్త మండలం లేదా సీడెడ్ అని పిలిచేవారన్నారు. ఈ ప్రాంతానికి ఈ పేరు నామోషీగా అనేక మంది భావించారని తెలిపారు. 1928 నవంబర్ 18న నంద్యాలలో కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభల సర్వసభ్య సమావేశంలో రాధాకృష్ణన్, ప్రకాశం పంతులు, అనిబిసెంట్ వంటి ముఖ్యులు హాజరయ్యారని తెలిపారు. ఆంధ్ర మహాసభలో నాయకుల ప్రతిపాదన మేరకు దత్త మండలం అనే పేరుకు బదులు రాయలసీమ అని పిలుస్తున్నారు. మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాయలసీమ నామకరణ దినోత్సవంగా ప్రకటించడంతోపాటు శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని, హైకోర్టులో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదాను అమలు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## నేడు మల్లేలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - తొండూరు**

మండలంలోని మల్లెల గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఇ బాల సంజీవులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. మల్లెలలోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మల్లెల గ్రామంలో, 11 కెవి దేవరకొన ఫీడర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# క్రైం కార్నర్

తేజా శారీ సెంటర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి మురళీ నాయక్

## రెండు దుకాణాల్లో చోరీ

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె ఆయా ప్రాంతాల్లో రెండు చోట్ల చోరీలు జరిగాయి. బాధితులు తెలిపిన మేరకు.. సోమవారం తెల్లవారుజామున స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న కందుల కాంప్లెక్స్‌లో ఉన్న తేజా శారీ సెంటర్ దుకాణానికి చెందిన బీగాలను దుండగులు పగులగొట్టి రూ.6వేలు నగదు, పట్టు చీరలతో పారిపోయారని బాధితుడు సుబ్బరాయుడు తెలిపారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న జీవాల మార్కెట్‌లో ఉన్న లక్కీ హెయిర్ స్టైల్ కటింగ్ షాపులో ఉన్న 32 ఇంచుల టివిని ఎత్తుకెళ్లినట్లు ఆ షాపు యజమాని వాపోయాడు. క్యాష్ పెట్టెను పగుల కొట్టేందుకు ప్రయత్నించారని తెలిపాడు. ఉదయం షాపులకు వచ్చి తలుపులకు ఉన్న బీగాలను చూసి దుకాణాల యాజమానులు షాక్‌కు గురయ్యారు. వేంపల్లెలో ఒకే రోజు రెండు చోట్ల చోరీలు జరగడంతో పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ సంఘటన స్థలాలను పరిశీలించారు. తేజా శారీ సెంటర్ దుకాణాన్ని పరిశీలించారు. దుకాణ యాజమాని సుబ్బరాయుడుతో విషయం అడిగి తెలుసుకున్నారు. చోరీ జరగకుండా ఉండేందుకు ప్రతి దుకాణాదారుడు సిసి కెమెరాలను అమర్చుకోవాలని డిఎస్పీ సూచించారు. దొంగలను పట్టుకొ నేందుకు ఆయా ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాలను తనిఖీ చేయాలని సిఐ నర్సింహులును ఆదేశించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు ఇవ్వాలని కోరారు. డిఎస్‌పి వెంట సిఐ నర్సింహులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో షేక్ ఇమ్రాన్ అనే యువకుడిని అరెస్టు చేశామని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక భాకరాపురం వీధిలో నివసించే షేక్ బాబ్జాన్ కుమారుడు షేక్ ఇమ్రాన్ లింగాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక పులివెందులలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో చదువుతోందన్నారు. ఇమ్రాన్ తనను ప్రేమించమని వెంటపడుతూ ఉండేవాడని, ఆ బాలిక ఎంత తిరస్కరించినా వినలేదు. విషయాన్ని బాలిక తన తండ్రికి చెప్పగా, ఆయన ఇమ్రాన్‌ను మందలించాడు. అది మనసులో పెట్టుకుని ఈనెల 7న ఓ కారును బాడుగకు తీసుకుని బాలిక ఇంటిలో ఎవరూలేని సమయంలో బలవంతంగా బాలికను కారులో ఎక్కించుకొని అనంతపురం తీసుకెళ్లి అక్కడ ఊరు బయటనున్న జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక గదిలో బంధించాడని సిఐ తెలిపారు. తనను అత్యాచారం చేశాడని, 14న ఇమ్రాన్ నుండి తప్పించుకుని లింగాల పోలీస్‌స్టేషన్‌లో మైనర్ బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. ఆ మేరకు ఆదివారం ఇమ్రాన్‌ను అరెస్టు చేశామని సిఐ వివరించారు. ఇమ్రాన్‌ను కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో లింగాల ఎస్‌ఐ అనిల్‌కుమార్, పోలీసులున్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ సిఐ వెంకటరమణ

# పెన్షనర్లలకు వైద్య సౌకర్యం కల్పించాలి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పెన్షనర్లకు వైద్య సౌకర్యం కల్పించాలని ఏపీ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఆయా సంఘం నాయకులు, సిఐటియు నాయకులు కోరారు. ఆ మేరకు వారు సోమవారం వారు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ చిన్న య్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.9వేలు డిఎ ఇవ్వాలని, ఈఎస్‌ఐ పద్ధతి ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, రైల్వేలో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీని పునరుద్ధరించాలని కోరారు. అనేక ఉద్యమాలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ సౌకర్యం కల్పించలేదని తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగుల పులివెందుల అధ్యక్షుడు పాపిరెడ్డి, సిఐటియు నాయకుడు గపూర్, ఏపీఎన్జీవో పెన్షనర్ కొండారెడ్డి, ఎలక్ట్రికల్ పెన్షనర్ సుబ్రమణ్యం, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతిపత్రమిస్తున్న పెన్షనర్లు

# డంపింగ్ యార్డును మార్చాలని నిరసన

పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె పంచాయతీలోని ఆయా ప్రాంతాల నుండి సేకరిస్తున్న చెత్తను పాములూరు గుట్ట ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీగాల రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు డంపింగ్ యార్డు మార్చాలని నిరసన చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేంపల్లెలో ఉన్న చెత్తను పాములూరు రహదారిలోని గుట్ట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిలో వేయాలని గతంలో అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. పంచాయతీలో సేకరిస్తున్న చెత్తను గ్రామ సమీపంలో ఉన్న స్థలంలో చెత్తను డంపింగ్ చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాములూరు గుట్ట ప్రాంతంలో చెత్తను వేయాలని కోరితే అధికారులు కారణాలు చెప్పడం మంచిది కాదన్నారు. గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును వెంటనే గ్రామ బయటికి మార్చాలని కోరారు. చెత్తను పాపాగ్ని నది పరిసర ప్రాంతాల్లో వేయడం వల్ల సమీప ప్రాంతాలు అలిరెడ్డిపల్లె, తూపల్లె గ్రామాలకు వెళ్లు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వేంపల్లె, చక్రాయపేట మండలాల అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయులురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉత్తన్న, బండారు వెంకటేష్, నాగరాజు, శివ, వేమయ్య పాల్గొన్నారు.

# ఎర్రగుంట్లలో ఆక్రమణల తొలగింపు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు సోమవారం కొరడా ఝుళిపించారు. బస్టాండు ఆవరణంలో రోడ్డుపై, వేంపల్లి రోడ్డులో ఆదివారం రాత్రి కొందరు బంకులను ఏర్పాటు చేశారు. విషయం మున్సిపల్ అధికారులకు తెలియడంతో సోమవారం ఉదయం కమిషనర్ శేషఫణి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆక్రమణదారులు ఏర్పాటు చేసుకున్న రేకుల బంకులను, తోపుడుబండ్లను మున్సిపాలిటీ ట్రాక్టర్లలో మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతము ఆర్టీసీ బస్సులు మలుపు తిరిగే చోట, ట్రాఫిక్ అంతరాయం కలిగేలా ఏర్పాటు చేయడంతో తొలగించామని తెలిపారు. మున్సిపాలిటీ అనుమతి లేనిదే రోడ్లపై ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయరాదని తెలిపారు.

**అనుమతిలేని భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోండి**

పట్టణంలో బిల్డింగ్ పర్మిట్ అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం సెప్టెంబరు నెలకు ముందు నిర్మించిన వాటికి బిపిఎస్ స్కీం కింద క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. రూ.10వేలు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చి 12లోపు మిగతా పెనాల్టీ మొత్తాన్ని చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఎల్ఆర్ఎస్ పథకం సవరించబడిందన్నారు. దరఖాస్తు గడువుకు మరో మూడు నెలలు అవకాశం కల్పించిందని తెలిపారు. లేఅవుట్లు ప్లాట్లను వచ్చే ఏడాది జనవరి 23లోగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

# రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : ఎమ్మెల్యే

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రభుత్వాసుపత్రికి వచ్చే నిరుపేదలకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు రూ.14 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు మంచి సదుపాయాలతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ రానుందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.14కోట్లు మంజూరు చేసిన సిఎం చంద్ర బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీలు, వీల్‌చైర్స్, బెడ్‌షీట్లు ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. త్వరలో ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, డిసిహెచ్ డాక్టర్ హిమదేవి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత, ఆర్ఎంఒ శివరాం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ పద్మజ, నల్లబోతుల నాగరాజు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎస్ఎస్ మాల్, డిఎడబ్ల్యూ కాలేజీ విషయంలో ఇలానే దీక్షలు చేస్తారా**

**టిడిపి ప్రొద్దుటూరు మాజీ ఇంచార్జ్ జి.వి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి**

ఎస్ఎస్ మాల్, డిఎడబ్ల్యూ కాలేజీ విషయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఇలానే దీక్షలు చేస్తారా అని టిడిపి ప్రొద్దుటూరు మాజీ ఇంచార్జ్ జి.వి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. స్థానిక టిబి రోడ్డులోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అతనికి అందాల్సిన మామూలు అందితే ఒక రకంగా, అందకపోతే మరో రకంగా మాట్లాడతారని ఆరోపించారు. ప్రస్తుత ఎగ్జిబిషన్ గుత్తేదారు అతనికి మామూలు అందించని కారణంగానే ఈ రకంగా దీక్షలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఎమ్మెల్యేగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎస్ఎస్ మాల్ వ్యవహారంలో ఎంత ముట్టిందో చెప్పాలన్నారు. ప్రస్తుతం ఎగ్జిబిషన్ జీఎస్టీ బకాయిలు రూ.90 లక్షల కోసం టెంట్ వేసి దీక్షలు చేస్తున్న రాచమల్లు ఎస్ఎస్ మాల్ వ్యవహారం కోసం ఇదే శిబిరాన్ని కొనసాగించాలన్నారు. స్థానికంగా ఉంటున్న డీఎడబ్ల్యూ కాలేజీ వ్యవహారంలో ముట్టిన రూ.70 లక్షల సంగతి ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి నిజానిజాలను ప్రొద్దుటూరు వాసులకు చెప్పి నిజాయితీ నిరూపించుకోవాలని హితవు పలికారు. కేవలం ఆయన నిజాయితీ పరుడని ప్రజలను నమ్మించే యత్నం కోసమే ఈ దీక్షలు అని విమర్శించారు.

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే 'పుట్టా'

## ప్రజలను ఇబ్బందిపెడితే ఉపేక్షించను

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు సకాలంలో పనులు చేసి పంపించాలని, ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులను హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఇల్లు లేని వారికి మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిబ్బంది, రెవెన్యూ, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పశువుల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పాడి రైతులకు సూచించారు. మంగపట్నం గ్రామంలో సోమవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ముద్దనూరు ప్రాంతీయ పశువైద్యశాల ఇంచార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ వాస శ్రీనివాస దూడల యాజమాన్యం, పశుపోషణలో మెలకువలు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు వివరించారు. దూడలకు నట్టల నివారణ మందు, గేదెలకు ఖనిజ లవణ మిశ్రమ ఇటుకలు, ఎముకల పొడి ప్యాకెట్లు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భారతి పాల్గొన్నారు.

## వృద్ధుల ఆలోచనలను పంచుకోవాలి

**జమ్మలమడుగు :** వయో వృద్ధుల ఆలోచనలు పంచుకోవాలని జమ్మలమడుగు జూనియర్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. సోమవారం స్థానిక గాయత్రి వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాలు నేటి సమాజంలో కరువయ్యాయని తెలిపారు. ప్రస్తుతం పెద్దలను, వృద్ధులను వృద్ధాశ్రమాలలో ఉంచుతున్నారని, వారికి కూడా హక్కులు, చట్టాలు ఉన్నాయన్నారు. వాటిని తెలుసుకోవాలని సూచించారు. డిశంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి**

**ముద్దనూరు :** బాలికలు, మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ దస్తగిరి సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం దస్తగిరి ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**O.S.No. 364/2022**

బి.బాలసుబ్బయ్య, తండ్రి బి. సుబ్బన్న, వయస్సు 47 సం॥, హిందూ, బిజినెస్, ఫోటోగ్రాఫర్, డోర్ నెంబర్ : 15/776, జిన్నా రోడ్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వైయస్ఆర్ కడప జిల్లా. **...వాది**

**Vs**

బి.సుబ్బారాయుడు, తండ్రి చిన్న నాగన్న, వయస్సు 38 సం॥, హిందూ, బిజినెస్, డోర్ నెంబర్ 5/6, మూలబాటవీధి, ప్రొద్దుటూరు రోడ్, మైదుకూరు టౌన్ & మండలం, వైయస్ఆర్ కడప జిల్లా. **...ప్రతివాది**

**దావా సమను**

పై తెలిపిన వాది ప్రతివాది అయిన మీ పైన పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు కానీ మీ వకీలు ద్వారా కానీ 06.01.2026వ తేదీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట మీకు పరోక్షంగా తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**వాయిదా తేదీ : 06.01.2026**

**బి.సుబ్బారెడ్డి**

**పిటిషనర్ తరం అడ్వొకేట్స్, ప్రొద్దుటూరు.**



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE : KADAPA**

**T.O.P. No. 37/2024**

1. B.Padmavathi and 4 Others. **...Petitioners**

**Vs**

1. B.Ramagopal Reddy and Others. **...Respondents**

**NOTICE TO RESPONDENT NO.4**

To,
Smt. Vennapusa Sudha Rani, Wife of Late Vennapusa Shankar Reddy, Hindu, aged 56 years, resident of D.No.26/960-6, Mitlamadi street, Proddatur Town, Kadapa District.

The Petitioners have filed the above Transfer petition against the Respondents and inspite of petitioners having sent notices to you three times already, you are will fully evading to take the said notice and returned the same with false endorsements. As such the petitioners are making a paper publication by this notice that the above Transfer petition is posted to 19.11.2025 and you are required to appear before this Hon'ble court at 10.30 A.M. either in person or through an advocate and file your objection. If you fail to do so the above matter will be decided exparte.

**//Given under the Order of the Hon'ble Court//**

**M. NARENDRANATH REDDY**
**Adocate,**
**KADAPA City. Cell: 9059063671.**

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

## కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 30వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డిపిఎంఒ శివశంకరయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతులు, పాదాలు, నరాలు, తిమ్మిర్లు, కళ్లు పూర్తిగా మూసుకో లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే చికిత్స చేయించుకోవాలన్నారు. సర్వేలో ఆశాలకు తగు సూచనలిచ్చారు. అనంతరం పురవీధులలో ర్యాలీ చేశారు. డిహెచ్‌ఈఒ శోభారాణి, సిఒ ఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శి ఉదయలక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న పురాతన నాణేలు, నోట్ల ప్రదర్శన

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో 4వ రోజు సోమవారం జమ్మలమడుగు శాఖా గ్రంథాలయంలో స్వదేశీ, విదేశీ పురాతన నాణేలు, నోట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జమ్మలమడుగు సబ్‌జైలు సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన నాణేల ప్రదర్శన, సాంస్కృతిక వారసత్వాన్ని తెలిపేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. నాణేల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మొదటగా గ్రంథాలయ పితామహులు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జీ, రాయల సీమ పురాతన నాణేల సేకరణ సంఘం సభ్యులు ఎస్.రంగనాథన్, లైబ్రరీ అబి.వృద్ధి, కమిటీ ప్రధాన కార్యదర్శి మిరియాల శివ గణపతి, కోశాధికారి అమీర్‌బాషా, ఉపాధ్యక్షులు డాక్టర్ నరసింహులు, వేంకటేశ్వరరెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

## క్విజ్‌తో మేధాశక్తి పెరుగుతుంది

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

క్విజ్‌తో మేధాశక్తి పెరుగుతుందని ప్రముఖ సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం రామేశ్వరం గ్రంథాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విజ్‌తోపాటు కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

## భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం : ఎంపీ

**ప్రజాశక్తి - చక్రాయపేట**

మండలంలోని సురభి పంచాయితీ కుప్పుగట్టుపల్లె గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కార్యకర్త ఎద్దుల భాస్కర (42) బ్రెయిన్ స్ట్రోక్‌తో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం భాస్కర మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాస్కర కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాధవి బాలకృష్ణ, సురభి సింగల్ విండో అధ్యక్షుడు సురేష్ కుమార్‌రెడ్డి, ఎల్ఎం రామాంజనేయరెడ్డి, సురభి మాజీ ఎంపిటీసీలు శ్రీనివాసులు, వేదమూర్తి, గఫూర్, దాసరి రాంబాబు, పలువురు వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గాయపడిన మహిళలు

## ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

బ్రహ్మంసాగర్ కట్టపై సోమవారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. కార్తిక చివరి సోమవారం కావడంతో పోరుమామిళ్ల మండలంలోని నాగులకుంట గ్రామానికి చెందిన ఓబుళమ్మ, రాజమ్మ, నారాయణమ్మ, సుధారాణి, పోలమ్మ బ్రహ్మంగారిని, పోలేరమ్మను దర్శించుకుని బ్రహ్మంసాగర్ చూసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగి గాయపడ్డారు. వీరిని 108లో ఆసుపత్రికి తరలించారు. గత వైసిపి ప్రభుత్వంలో లేకేజీ పనులు చేపట్టడంలో భాగంగా డ్రిల్స్, కట్టపై రోడ్డు చెడగొట్టారు. నాలుగేళ్లవుతున్నా రోడ్డు, డ్రిల్స్ ఏర్పాటు చేయలేదు. బ్రహ్మంసాగర్‌ను చూసేందుకు వచ్చే పర్యాటకల సంఖ్య అధికంగా ఉంటుంది. సరిగాలేని రోడ్డు, డ్రిల్స్‌ను బాగు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.


**మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**O.S.No. 44/2025**

మాడెం క్రిష్ణారెడ్డి, తండ్రి లక్ష్మి రెడ్డి, హిందూ, 59 సం॥, లేబర్ కాంట్రాక్టర్, R/o డి.నెం.4/53-ఎ, దొరసానిపల్లి, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వైయస్ఆర్ (జిల్లా). **...పిటీషనర్/క్రెడిటార్**

**Vs**

1) చెక్కా లక్ష్మీదేవి, తండ్రి చిన్న ఆదెప్ప, భర్త ఉమ్మడిశెట్టి వెంకట సుబ్బమ్మ, హిందూ, గృహిణి, 57 సం॥, R/o జడ్పీ హైస్కూల్ వెనుకవైపు, దొరసానిపల్లి, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వైయస్ఆర్ (జిల్లా).

2) ఉమ్మడిశెట్టి నాగజ్యోతి భర్త వెంకట సుబ్బారాయుడు, హిందూ, గృహిణి, 46 సం॥, R/o డి.నెం.1/249-ఎ, దొరసానిపల్లి, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వైయస్ఆర్ (జిల్లా). **...రెస్పాండెంట్స్/Debtor/Vendee**

**జనరల్ పబ్లిక్ నోటీసు**

పై IP లోని పిటీషనర్/Debtor, పై IPలోని రెస్పాండెంట్స్/Creditors అయిన మీపైన, పై IPని దాఖలు చేయగా, అందు రెస్పాండెంట్స్ అయిన మీకు మరియు ఇతరులకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల పై రాజశ్రీ కోర్టులో వాయిదా 28.11.2025వ తేదీ ఉ॥గం॥10.30 ని॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల పై IP పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

**వాయిదా తేదీ : 28.11.2025**

**వి.ఈశ్వర రెడ్డి**

**పిటిషనర్ తరం అడ్వొకేట్స్, ప్రొద్దుటూరు.**